అటకెక్కిన సబ్‌స్టేషన్ నిర్మాణం

- సబ్‌స్టేషన్ నిర్మాణానికి గత ప్రభుత్వం చొరవ
- టెండర్ దశలో నిలిచిన భారీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు
- రుస్తుంబాదలో10 ఎకరాల స్థలంలో నిర్మించాలని నిర్ణయం
- నిర్మాణం పూర్తయితే తీరనున్న లో–ఓల్టేజ్ సమస్య


నరసాపురంలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

నరసాపురం: నరసాపురంలో భారీ విత్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవ చూపింది. స్వయంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. టెండర్ దశకు చేరుకున్న ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కొత్త కూటమి ప్రభుత్వంలో అటకెక్కింది. విద్యుత్ లో–ఓల్టేజ్ సమస్యలకు చెక్ పెడుతూ రూ.133 కోట్లతో 10 ఎకరాల స్థలంలో 50 ఎంవీఏ సామర్థ్యంతో 220/132/11 కేవీ భారీ సామర్థ్యంతో ఈ కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించ తలపెట్టారు. గత ప్రభుత్వం ట్రాన్స్‌కో ద్వారా దీనికి సంబంధించి జీవో నెంబర్ 2368ని 2021 ఫిబ్రవరిలో విడుదల చేసింది. వెంటనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టడానికి సన్నాహాలు చేశారు. అయితే ప్రభుత్వం మారడంతో పనులకు అతీగతీ లేకుండా పోయింది.

లో–ఓల్టేజ్ సమస్యలకు చెక్ పెట్టాలని

నరసాపురంలో ఇప్పటికే 132/11 కేవీ సబ్‌స్టేషన్ ఉంది. ఈ సబ్‌స్టేషన్‌లో గతంలో 50 ఎంవీఏ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఉండేది. 2020లో ఆ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 80 ఎంవీఏకు పెంచారు. మళ్లీ అదనంగా దానికి అనుసంధానంగా మరో 50 ఎంవీఏ సామర్యం గల కొత్త 220/132/11 కేవీ సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, మొగల్తూరు, పోడూరు మండలాలకు ప్రస్తుతం నరసాపురం సబ్‌స్టేషన్ నుంచే విద్యుత్ సరఫరా అవుతోంది. ఇందులో నరసాపురం, పాలకొల్లు మున్సిపాలిటీలు ఉన్నాయి. నరసాపురం, పాలకొల్లు రూరల్ మండలాలు, యలమంచిలి, మొగల్తూరు, పోడూరు మండలాల్లో ఎంతో కాలంగా విద్యుత్ లో–ఓల్టేజ్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలకు చెక్ పెట్టడానికి భారీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించాలని గత ప్రభుత్వంలో అప్పటి ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఈ ప్రాజెక్ట్ మంజూరు చేయించారు. వెంటనే రుస్తుంబాదలో 10 ఎకరాల స్థలాన్ని కూడా సేకరించారు.

పనులు మొదలు పెట్టాలి



కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్‌కు అప్పట్లో వెంటనే నిధులు మంజూరు చేశారు. ఎన్నికలు రావడంతో టెండర్లు పిలవడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. నిధులు అందుబాటులో ఉన్నాయి. టెండర్లు పిలిచి పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలి. కొత్త సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే లో–ఓల్టేజ్ సమస్యలు ఉండవు. భారీ సామర్థ్యంతో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ కట్టడం వలన ఇక విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఉండవు. దీనిని దృష్టిలో పెట్టుకునే అప్పట్లో ఈ భారీ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశాం.


– ముదునూరి ప్రసాదరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

- మహాచండీదేవిగా దర్శనం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు


పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాచండీదేవి


పెనుగొండలో నగరేశ్వర స్వామి ఆలయంలో గాయత్రీ దేవిగా మహిషాసురమర్దని


నరసాపురం: విశేష అలంకరణలో కనకదుర్గమ్మ


మొగల్తూరు: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


యలమంచిలి: అమ్మవారి నూతన వస్తువులకు పూజ చేస్తున్న అర్చకులు

నరసాపురం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలో పలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సోమవారం అన్ని మండపాలు, అమ్మవార్ల ఆలయాల వద్ద ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. పండ్ల మార్కెట్ వద్ద జరుగుతున్న ఉత్సవాల్లో అమ్మవారు శ్రీస్కంధ మాతాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గోల్డ్ మార్కెట్ వద్ద స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో అమ్మవారిని వెండి వస్తువులతో అలంకరించారు. గడ్డి బజార్ కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాయిపేట కనకదుర్గ అమ్మవారికి విషేష అలంకరణ చేశారు.

మహా చండీ దేవిగా అమ్మవారు

మొగల్తూరు: దేవి శరన్నవరాత్రుల వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రీ చండీ అమ్మవారిలో అనేక మంది దేవతలు కొలువై ఉన్నారని, మహా చండీ అమ్మవారిని ప్రార్థిస్తే సర్వదేవతలను ప్రార్థించినట్లేనని పండితులు ప్రవచించారు. సోమవారం అమ్మవారు మహా చండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక సత్తరువుపాలెం రామాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని మహా చండీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేరుపాలెం నార్త్, సౌత్, రామన్నపాలెం, శేరేపాలెం ,కొత్తపాలెం, కాళీపట్నం, పాతపాడు, జగన్నాదపురం,కెపిపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లోను, ప్రత్యే కూడళ్ళలోను ఏర్పాటు చేసిన అమ్మవారికి పూజలు నిర్వహించారు.

పుంతలో ముసలమ్మకు అలంకరణ వస్తువులు

యలమంచిలి: దేవి శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అడవిపాలెంలోని పల్లపు వీధిలో వెలసిన శ్రీ పుంతలో ముసలమ్మకు గ్రామానికి చెందిన బొలిశెట్టి త్రిమూర్తులు, దుర్గ దంపతులు సోమవారం వెండి అలంకరణ వస్తువులు సమర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా శివకోడుకు చెందిన మాలే దుర్గేష్ ఇత్తడి మకర తోరణం, పోతురాజు సత్యనారాయణమూర్తి ఇత్తడి కిరీటం, అడవిపాలెం గ్రామానికి చెందిన ఈమన రమేష్ ఇత్తడి గంట సమర్పించారు. ఈ వస్తువులన్నింటికీ అర్చకులు ఆగమ ప్రవర సుదర్శనం శ్రీనివాసాచార్యులు బ్రహ్మత్వంలో బొలిశెట్టి త్రిమూర్తులు దుర్గ దంపతులచే విఘ్నేశ్వర పూజ, వస్తు పూజ నిర్వహించారు.

గాయత్రీ దేవిగా అమ్మవార్లు

పెనుగొండ: శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం అశ్వీయుజ శుద్ధ చవితి సందర్భంగా ఆచంట, పెనుగొండ మండలాల్లో అమ్మవార్లు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. ప్రసిద్ధి గాంచిన పెనుగొండలో శ్రీనగరేశ్వర మహిషాసుమర్దనీ, వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో మహిషాసుమర్దనీ, మూలవిరాట్ వాసవీ మాతలు గాయత్రీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతిధాంలో మరకత శిల వాసవీ మాత శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆచంట మండలం పెదమల్లం మాచేనమ్మ ఆలయంలోని మాచేనమ్మ తల్లిని శ్రీ రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. పెనుగొండ మండలం వడలి, సిద్ధాంతం, చినమల్లం, ఇలపర్రుల్లో అమ్మవారి ఆలయాల్లో పూజలు, అర్చనలు నిర్వహించారు.

క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాచండీదేవి

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరించారు. స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించారు. అమ్మవార్లకు ఉదయం నుంచి లక్ష కుంకుమార్చనలు చేశారు.

కళాకారులకు సత్కారం


కళాకారులను సత్కరిస్తున్న వేదపండితులు ఈరంకి కాశీవిశ్వనాథం

పాలకొల్లు అర్బన్: కళాకారులను ప్రోత్సహించవలసిన అవసరం ప్రతి ఒక్కరి పైనా ఉందని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ఈరంకి కాశీవిశ్వనాథం అన్నారు. శ్రీధర రాధా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ 15వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన కళాకారులు మాడుగుల కృష్ణమోహన్, జి.మనుప్రియ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రేమకు పరాకాష్ట అనే సాంఘిక నాటిక ప్రదర్శించారు. వీధి నాటిక ప్రేక్షకులను అలరించింది. ఇప్పటి వరకు ఈ నాటిక 252 సార్లు వివిధ ప్రాంతాల్లో ప్రదర్శించామని, 500 ప్రదర్శనలు ఇవ్వాలనే లక్ష్యంతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు తిరుగుతున్నామని కళాకారుడు మాడుగుల కృష్ణమోహన్ విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులకు కాశీ విశ్వనాథం ఆర్థిక సత్కారం చేసి నూతన వస్త్రాలను బహూకరించారు. అలాగే శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు కళాకారులను శాలువాతో సత్కరించి స్వామివారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో దేవళ్ల నరసింహమూర్తి, బాలి ఏడుకొండలు, తాతపూడి శర్మ తదితరులు కళాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజల ఫిర్యాదులపై తక్షణం చర్యలు చేపట్టాలి


ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఆర్డీవో దాసి రాజు

నరసాపురం: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణం చర్యలు తీసుకోవాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమాన్ని ఆర్డీవో నిర్వహించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఫిర్యాదులు, దరఖాస్తులు అందించారు. మొత్తం 35 ఫిర్యాదులు అందినట్లు ఆర్డీవో తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమంలో ఒకసారి ఫిర్యాదు చేసిన వారు మళ్లీ అదే సమస్యపై వచ్చే అవకాశం ఇవ్వకూడదన్నారు. సమస్యల పరిష్కారం ఎంతవరకూ వచ్చిందనే అంశాన్ని ఎప్పటికప్పుడు తనకు నివేదిక ఇవ్వాలని తహసీల్దార్లకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్సుపై అవగాహన కలిగి ఉండాలి

భీమవరం: విద్యార్థులు చిన్ననాటి నుంచి సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. విష్ణు విద్యా సంస్థలో నిర్వహిస్తున్న వరల్డ్ స్పేస్ వీక్ కార్యక్రమాల్లో భాగంగా వివిధ పోటీల్లోని విజేతలకు సోమవారం ఆయన బహుమతులు అందజేశారు. నేడు ప్రపంచమంతా భారత దేశంవైపు చూడ్డానికి ఇస్రో చేపట్టే ప్రయోగాలు కూడా ఒక కారణమన్నారు. కార్యక్రమంలో జె.ప్రసాదరాజు, పి.శ్రీనివాసరాజు, ఐఆర్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారం చెల్లించాలి


వల్లూరులో ధర్నా చేస్తున్న కౌలు రైతుల సంఘం

పెనుగొండ: పంట దెబ్బ తిన్న రైతులు, కౌలు రైతులకు తక్షణం పంట నష్ట పరిహారం చెల్లించాలని ఏపీ కౌలు రైతుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం వల్లూరులోని రైతు సేవా కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. గత ఏడాది 250 ఎకరాలు, ఈ సీజన్‌లో 280 ఎకరాల్లో పంట నష్టం సంభవించిందన్నారు. రైతు సేవా కేంద్రం సరైన సమాధానం ఇవ్వక పోవడం దారుణమన్నారు. బ్యాంకు ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మారడం వలన ఇబ్బందులు ఎదురయ్యాయని చెబుతున్నారన్నారు. మురుగు కాలువల ఆధునికీకరణ చేయకపోవడంతోనే ఇబ్బందులని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘ సీనియర్ నాయకులు సూర్యనారాయణ రాజు కేతా గోపాలన్, బొర్రా ధర్మారావు, బోళ్ల సుబ్బారావు, గుడాల శ్రీను, పిల్లి శ్రీరాములు, నాగేశ్వరరావు, మట్టపర్తి రమేష్, మిద్దే సత్యనారాయణ, కడలి లోహిదాసు, మట్టపర్తి లక్ష్మణరావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం


ఆచంటలో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

పెనుగొండ: రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా, నిల్వ చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు ఆచంటలో ఒక షెడ్ నందు విజిలెన్సు, రెవెన్యూ, పౌర సరఫరా అధికారులు తనిఖీ చేయగా గెల్లి వెంకట విశ్వనాథగుప్తా అక్రమంగా నిల్వ చేసిన 43.76 క్వింటాళ్ల రేషన్ బియ్యం అధికారులు గుర్తించారు. ఏపీ 39 టీయూ 1265 నెంబరు గల అశోక్ లేలాండ్ దోస్త్ వాహనాన్ని తనిఖీ చేయగా 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారని గుర్తించి అతనిని ప్రశ్నించగా ఆచంట, పరిసర ప్రాంతాలలో కిలో రు.16లకు కొనుగోలు చేసి వాటిని, కోనసీమ జిల్లా ఆలమూరు మండలం నర్సిపూడికి చెందిన బియ్యం వ్యాపారి పి.గంగరాజుకు కిలో రు.18లకు అమ్ముతున్నట్లు తెలిపాడన్నారు. ఈ తనిఖీలో రూ.2,95,040 విలువ కలిగిన బియ్యాన్ని, రూ.10,34,522 విలువ కలిగిన వాహనాన్ని సీజ్ చేసి గెల్లి వెంకట విశ్వనాథగుప్తా, ఎం.సత్యనారాయణ, పి.గంగరాజులపై నిత్యవసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివ రామకృష్ణ, ఆచంట మండలం సీఎస్ఆర్ఐ కేవీవీ సత్యనారాయణ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈవోపీఆర్డీ బాధ్యతల స్వీకరణ


ఎంపీడీవో నందిపాటి ప్రేమాన్వితను కలిసిన జేడీవీ ప్రసాద్

యలమంచిలి: మండల ఈవోపీఆర్డీగా జేడీవీ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఉండ్రాజవరం మండల ఈవోపీఆర్డీగా పని చేస్తూ బదిలీపై యలమంచిలి వచ్చారు. ఆయన గతంలో మండలంలోని దొడ్డిపట్ల, అడవిపాలెం, యలమంచిలి, అబ్బిరాజుపాలెం తదితర గ్రామాలలో గ్రామ కార్యదర్శిగా పని చేశారు. ఇంత వరకు యలమంచిలి మండల ఈవోపీఆర్డీగా పని చేసిన షేక్ షరీఫ్ పెదవేగి మండల ఈవోపీఆర్డీగా బదిలీపై వెళ్లారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


ఆచంట మండల పాస్టర్ల సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం

పెనుగొండ: ఆచంట మండల పాస్టర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ఆచంట క్రీస్తు ప్రార్థన మందిరంలో రెవరెండ్ గాదిరాజు తిమోతి రాజు, బి.డేవిడ్‌రాజు అధ్యక్షతన మండల పాస్టర్ల సంక్షేమ సంఘ సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పొలుమూరి శేఖర్‌బాబు, అధ్యక్షుడిగా ఇంజేటి డేవిడ్, ఉపాధ్యక్షుడుగా కె.సువర్ణరాజు, ప్రధాన కార్యదర్శిగా పారుపల్లి యేసురత్నం, సంయుక్త కార్యదర్శిగా నక్క సన్నీ బాబు, కోశాధికారిగా నక్క తిమోతి, ఎగ్జిక్యూటివ్‌గా కె.డేవిడ్, డైరెక్టర్‌గా కె.విజయరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలు


టోర్నమెంట్ నిర్వహించనున్న కాస్మోక్లబ్ టెన్నిస్ కోర్టు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో నేటి నుంచి రెండు రోజులు రాష్ట్ర స్థాయి టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. క్లబ్ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు మాట్లాడుతూ రుద్రరాజు పద్మరాజు మెమోరియల్ స్టేట్ టెన్నిస్ టోర్నమెంట్ మంగళవారం, బుధవారం రెండు రోజులు నిర్వహిస్తారన్నారు. అండర్–8, 10, 12, 14 విభాగాల్లో బాలురు, బాలికలకు సింగిల్, డబుల్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్–8, 9 క్రీడాకారులకు రూ.500 అండర్–12, 14 క్రీడాకారులకు రూ.700, అలాగే డబుల్స్ క్రీడాకారులకు రూ.800 ఎంట్రీ ఫీజులు నిర్ణయించినట్లు తెలిపారు. క్రీడాకారులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రామ మందిర పునాది డిజైనర్‌కు సత్కారం


మండెల పాండురంగారావు దంపతులను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

పాలకొల్లు అర్బన్: అయోధ్య రామ మందిర పునాదిని డిజైన్ చేసిన మండెల పాండురంగారావు సోమవారం గోరింటాడ విచ్చేశారు. పాండురంగారావు తాత స్వస్థలం గోరింటాడ కావడంతో ఆయన ఈ ప్రాంతానికి సోదరుడితో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా స్థానికులు, వంశీయులు శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం ఆయన పాలకొల్లు పట్టణం అచ్చుగట్లపాలెంలో వేంచేసియున్న శ్రీ ముఖదారమ్మవారిని దర్శించుకొని, రూ.2 లక్షల విరాళం అందజేశారు. విద్యార్థులు సాంకేతిక విజ్ఞానంపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో మండెల శ్రీరామమూర్తి, మండెల రజని, మండెల రాధా కృష్ణకుమార్, మండెల వెంకట సుబ్బారావు, మండెల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్డు సభ్యులకు శిక్షణ

మొగల్తూరు: నేటి నుంచి రెండు రోజులు పాటు పంచాయతీ ఉప సర్పంచ్‌లకు, ఇద్దరు వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో త్రిశూల పాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వార్షిక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా అధికారుల ఆదేశాల మేరకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు చెందిన ఉప సర్పంచ్‌లకు, ప్రతీ గ్రామ పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు సభ్యులకు (ఒక మహిళ, ఒక పురుషుడు) 8, 9వ తేదీల్లో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

యథేచ్ఛగా కూటమి సర్కారు ఇసుక దోపిడీ

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు విన్‌స్టన్‌బాబు


కుంచిలపల్లి విన్‌స్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: కూటమి సర్కార్ ఇసుక ఉచితంగా అందిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఇసుకను దోపిడీ చేయడానికి ద్వారాలు తెరిచారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి విన్‌స్టన్‌బాబు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ఇసుక లభించకపోవడంతో నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక సులభతరం చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ట్రక్కు ఇసుక రూ.30 వేలు ధర పలుకుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి నేతలు ఇసుకను దోపిడీ చేయడానికి అన్ని మార్గాలు తెరిచారని దుయ్యబట్టారు. ఇసుక ఫ్రీ అంటూ నిర్మాణ రంగ కార్మికులను మోసం చేశారని, అలాగే ఉచిత గ్యాస్ సిలిండర్లు అంటూ అక్కచెల్లెమ్మలను మోసం చేశారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలను మోసం చేశారని, అలాగే కుల, మతాలను రెచ్చగొడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని విన్‌స్టన్‌బాబు విమర్శించారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


పశువైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయకర్, వైద్యులు, నాయకులు

మొగల్తూరు: పశుపోషకులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ కోరారు. మండలంలోని కాళీపట్నం పడమరలో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత పశుగర్భకోశ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా సుమారు 60 పశువులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కపురు సావిత్రి ఆదినారాయణ, పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ జి.జేసురత్నం,, డాక్టర్ నీలిమ, డాక్టర్ వై.సుధాకర్, డాక్టర్ సురేంద్ర కుమార్, డాక్టర్ మహేష్, నాయకులు కొల్లాటి గోపి, జోగి పండు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు

పెనుగొండ: ఇసుక అక్రమ రవాణా, అక్రమ తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పెనుగొండ తహసీల్దార్ జి.అనితకుమారి హెచ్చరించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఇసుక, మట్టి అక్రమ రవాణాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పెనుగొండ మండలంలో గోదావరి నదీ పరివాహక ప్రాంతాలైన సిద్ధాంతం , నడిపూడి ర్యాంపుల వద్ద అనుమతి లేకుండా ఎటువంటి తవ్వకాలు, రవాణా జరగకుండా పోలీసు సహకారంతో వీఆర్వో, వీఆర్ఏలను రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహించడానికి ఆదేశించడమైందని తెలిపారు. వీటితో పాటు మిగిలిన గ్రామాల్లో ఎక్కడైనా అనధికారికంగా ఇసుకను రవాణా చేసినట్లయితే వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.